క్లుప్తంగా

యువకుడు ఆత్మహత్య

మార్కాపురం రూరల్: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ సర్పంచి లక్ష్మయ్య కుమారుడు రమేష్(20) డిగ్రీ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు ఏదో ఒక పని చూసుకోమని చెబుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రమేష్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. ఇంటి పక్కన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

గిరిజన గూడేల్లో సింగపూర్ బృందం పర్యటన



గూడేల్లో పరిస్థితులను పరిశీలిస్తున్న సింగపూర్ బృంద సభ్యులు

పెద్దదోర్నాల: గిరిజనులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే ఉద్దేశంతో సింగపూర్ దేశానికి చెందిన బృందం శుక్రవారం పెద్దదోర్నాల మండలంలోని పలు గూడేల్లో పర్యటించింది. మల్రిపాలెం, పనుకుమడుగు, మంతనాల, పోతన్నగూడెం, నందిగూడెం, బీఎంసీ కాలనీల్లో కలియతిరిగిన సింగపూర్ ప్రతినిధులు స్థానిక పరిస్థితులను పరిశీలించారు. గూడేల్లో సోలార్ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, వాటర్ టెస్టింగ్ కోసం శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో సింగపూర్‌కు చెందిన డానిల్ చూఅయ్, లీ చుమింగ్, ఫణికుమార్, సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చెర్మన్ ప్రకాష్ బాబు, కోశాధికారి చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ చైర్మన్ జోగి వెంకటనారాయణ, ఎంసీ మెంబర్లు అంబడి జగన్‌మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు సజావుగా సాగాలి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: స్థానిక సంస్థల్లో ఆకస్మికంగా ఏర్పడిన ఖాళీల్లో ఉప ఎన్నికలు ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనం నుంచి డీపీఓ నారాయణరెడ్డితో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలు, 63 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మండలాల వారీగా సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలు, 63 వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. నామినేషన్ గడువు ముగిసే సమయానికి సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 132 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు, వార్డు స్థానాలకు 126 నామినేషన్‌లు వాలిడ్ అయినట్లు నిర్ధారించారు. తిరస్కరణకు గురైన నామినేషన్లకు సంబంధించి అభ్యంతరాలు తెలిపేందుకు శనివారం అవకాశం కల్పించారు. 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- పోలీసు సిబ్బందితో ఎస్పీ మలికాగర్గ్



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. శుక్రవారం నిర్వహించిన పోలీసు సంక్షేమ దివస్‌లో ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎస్పీని కలిసి వారి సమస్యలు విన్నవించుకున్నారు. సస్పెండ్, రిలీవ్‌తో పాటు కుటుంబ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను విన్న ఎస్పీ.. తగిన పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీవో ఏవో ఎం.సులోచన, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, స్పందన ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

- రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

యర్రగొండపాలెం: తల్లిదండ్రులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులకు బాల్యవివాహాల నిషేధ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో డ్రాపౌట్స్‌ను గుర్తించి బడిలో చేర్పించినట్లయితే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. లేదంటే వారు కార్మికులుగా మారడంతోపాటు చెడు అలవాట్లకు బానిసలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలతో మంచి జీవితం కోల్పోతారని చెప్పారు. అన్ని వర్గాలకు చెందిన పేద పిల్లలు చదువుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అమ్మఒడి పథకం ద్వారా నగదు అందిస్తున్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అనేక మంది పిల్లలకు మంచి జీవితాన్ని ప్రసాదించారన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులు తమ సమస్యలను విన్నవించుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను మార్చాలి

ఎస్సీ హాస్టల్‌లోని గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మాణనాయక్‌ను ఆదేశించారు. కిటికీలు లేకపోవడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫ్యాన్లు సక్రమంగా తిరగడం లేదని, వాచ్‌మెన్ కొడుతున్నాడని, పరిశుభ్రంగా లేని నీటిని తాగాల్సి వస్తోందని, రాత్రి వేళ హాస్టల్ ఆవరణలో పాములు, తేళ్లు సంచరిస్తుంటాయని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పద్మావతి.. తక్షణమే హాస్టల్లో మైనర్ రిపేర్లు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, జిల్లా కమిషన్ సభ్యురాలు నీలిమ వంశీలత, సీడీపీఓ పద్మావతి, ఎంఈఓ మల్లునాయక్, ఎస్సై జి.కోటయ్య, సార్డ్స్ సంస్థ ఏపీఎం ఎం.మరియబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల్లో ఆర్థికాభివృద్ధి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, పక్కన ఎమ్మెల్యే అన్నా

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని ఎల్.కోట, తెల్లదిన్నె గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన 138వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యేను స్థానికులు గజ మాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ పేదలకు అండగా ఉండేందుకు అర్హులకు నవరత్న పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. స్థానికంగా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డ్వామా ఏపీడీ భాస్కర్, ఎంపీడీఓ మస్తాన్ వలి, జెడ్పీటీసీ కొత్తపల్లె జ్యోతి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమిలిదిన్నె చెన్నారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సయ్యద్ జాకీర్ హుస్సేన్, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరత్నం, సుబ్బయ్య, రాజయ్య, వెంకటరాజులు, శ్రీనివాసరెడ్డి, జగన్, కోటయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

డ్వాక్రా మహిళలకు నాలుగో విడత సున్నా వడ్డీ రుణమాఫీ చేసిన సందర్భంగా ఎల్.కోట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అన్నా సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేశారని పేర్కొన్నారు.



హైకోర్టు సీజేని కలిసిన కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ

ఒంగోలు అర్బన్: ఒంగోలు వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను స్థానిక ఎన్ఎస్పీ అతిథి గృహంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మున్సిపాల్టీలోని 10వ సచివాలయం 16వ వార్డు ప్రాంతంలోని బాపూజీ కాలనీలో వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షితతో కలిసి పర్యటించారు. నవరత్నాలతో పాటు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి కుటుంబంలోని మహిళలకు ప్రభుత్వం పథకాల లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సేవలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. తమకు సంక్షేమ పథకాలతో లక్షల రూపాయల మేర లబ్ధి చేకూరడంతో ఇబ్బందులు తప్పాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు సంతోషంగా చెప్పారు. తొలుత ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, దొడ్డా భాగ్యలక్ష్మి, రంగలక్ష్మి, నగేష్, కొత్త కృష్ణ, సిరాజ్, వనజాక్షి, నాయకులు ఉస్మాన్, రోజ్‌లిడియా, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కరీంబాషా పాల్గొన్నారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: విమానయాన పరిశ్రమకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయక మంత్రి డాక్టర్ వీకే సింగ్ సమాధానమిచ్చారు. దేశంలో విమానయాన పరిశ్రమ నిర్వహణ, మరమ్మతుల రంగాన్ని విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉదార, పెట్టుబడిదారులతో స్నేహపూర్వక విధానాన్ని అనుమతించిందన్నారు. ఈ రంగానికి సంబంధించి ప్రత్యక్ష డేటా ఏదీ విమానయానశాఖ నిర్వహించడం లేదన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకై తిరుపతి విమానాశ్రయ సెంటర్‌కు సంబంధించి భారత విమానాశ్రయ అథారిటీ రెండు స్థలాలను గుర్తించి రెండు రౌండ్లు బిడ్లు కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ, బిడ్లు ఇంకా అందలేదని కేంద్ర మంత్రి చెప్పారు.

మద్యం మత్తులో అన్నను చంపిన తమ్ముడు



వెంకట చెన్నయ్య మృతదేహం



చెన్నయ్య(ఫైల్)

ఒంగోలు టౌన్: వాళ్లిద్దరూ చిన్నమ్మ, పెద్దమ్మ పిల్లలు. వరసకు అన్నాదమ్ములైనా అంతకు మించి మంచి స్నేహితులు. అయితే మద్యానికి బానిసైన వారిద్దరూ రోజూ కలిసి తాగేవారు. తాగి తిరిగేవారు. అలాంటిది ఏమైందో ఏమో తాగిన మత్తులో మాటమాట అనుకున్నారు. చివరికది హత్యకు దారితీసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు నగరంలోని బిలాల్ నగర్ పాపాకాలనీకి చెందిన దార్ల వెంకట చెన్నయ్య (45) ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. సత్యనారాయణపురం కరవది వీధికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేసే సిట్టా ఏడుకొండలు అతడికి వరసకు తమ్ముడు అవుతాడు. గురువారం రాత్రి చెన్నయ్య ఎప్పటిలాగే సత్యనారాయణపురంలోని ఏడుకొండలు వద్దకు వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో మాటమాట అనుకున్నారు. దాంతో ఆగ్రహానికి గురైన ఏడుకొండలు పక్కనే ఉన్న కర్ర తీసుకొని కొట్టాడు. అంతటితో ఊరుకోకుండా మద్యం తాగగా ఖాళీ అయిన సీసాతో కిందపడిపోయి చెన్నయ్యపై దాడికి దిగాడు. తలకు తీవ్ర గాయం కావడంతో చెన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రమణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు త్రివేణి ఇంటర్మీడియెట్ చదువుతుండగా, కుమారుడు లక్ష్మీనారాయణ 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మృతితో చిన్నారులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 20 మందికి జైలు

ఒంగోలు టౌన్: ఒంగోలు ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20 మందికి 15 రోజుల జైలు శిక్ష లేదా రూ.10 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు న్యాయస్థానం శుక్రవారం తీర్పు చెప్పింది. వీరిలో 17 మంది ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున జరిమానా చెల్లించగా, ముగ్గురు మాత్రం జైలుకు వెళ్లారు.

కారు ఢీకొని చిరు వ్యాపారి మృతి



గోవిందు మృతదేహం

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజమండ్రికి చెందిన మేడిశెట్టి గోవిందు(50) ఇటీవల కేశినేనిపల్లిలో హైవే పక్కన బడ్డీ బంకు పెట్టుకుని, భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తన దుకాణం వద్ద బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా మార్కాపురం నుంచి వినుకొండ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో సంఘటనా స్థలం వద్దే ఆయన మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

క్లుప్తంగా

ప్రతి ఇంటిపై తిరంగా ఎగురవేయాలి

మార్కాపురం: ఈనెల 9 నుంచి 15 వరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలని మార్కాపురం డివిజన్ పోస్టల్ సూప రింటెండెంట్ కె.శ్రీనివాస్ కోరారు. పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు రూ.25కు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోస్టల్ సిబ్బందితో కలిసి హెడ్ పోస్టాఫీస్ నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు.

స్కిల్ హబ్ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం శుభపరిణామమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో స్కిల్ హబ్ కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కాపురం ప్రాంతంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువకులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని ఉద్యోగంలో చేరి కుటుంబానికి ఆసరాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెరీకల్చర్ ఏడీ నారాయణరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ, నాగశ్రీను, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ

దర్శి: ప్రజా సంకల్ప సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నాలుగు వేల మందికి పైగా విద్యార్థులతో నిర్వహించే నియోజక వర్గ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఎంఈఓ కాకర్ల రఘురామయ్య శుక్రవారం ఆవిష్కరించారు. హైకోర్ట్ అడ్వకేట్ మధిరె రంగసాయి రెడ్డిని ఎంఈఓ అభినందించారు. మధిరె కృష్ణారెడ్డి, రవినాయక్, ఎస్. కోటిరెడ్డి, సాయితేజ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు (ముండ్లమూరు): స్థానిక మండల పరిషత్ కార్యలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తారు. ఈ మేరకు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో సర్పంచ్ జాన్ ప్రకాష్ అధ్యక్షతన రిలయన్స్ ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఉమాదేవి, రిలయన్స్ టీమ్ జెస్సీగ్లోరి, సర్వేశ్వరరెడ్డి, నాసరమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం


నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి రూరల్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పొదిలి మండలం మాదాలవారిపాలెం సచివాలయంలో ఏర్పాటు చేసిన మాదాలవారిపాలెం సొసైటీ నూతన అధ్యక్షుడు ప్రమాణస్వీకార మహోత్సవంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. చైర్మన్‌గా మాదాలవారిపాలెం గ్రామానికి చెందిన అనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, సభ్యులుగా తుమ్మగుంట గ్రామానికి చెందిన బీరం బ్రహ్మారెడ్డి, కంభాలపాడుకు చెందిన మల్లాపురం నరసింహులుతో పీఏసీఎస్ సీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ముందుగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, నూతన పాలక మండలి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని సొసైటీ చైర్మన్ అనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి ఇంటి దగ్గర నుంచి ఊరేగింపుగా వచ్చారు. దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నూతన పాలక మండలి సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, పులిగొర్ల శ్రీనివాసులు, జూపల్లి ఏడుకొండలు, గుంటూరి నాగిరెడ్డి, వెలిదండి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు బాధితులకు సీపీఆర్‌తో ఉపయోగం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: గుండెపోటు బాధితులకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సొసైటీ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, హైదరాబాద్‌కు చెందిన అపోలో హాస్పిటల్ అత్యవసర విభాగం డాక్టర్లతో బేసిక్ లైఫ్ సపోర్టు, కార్డియో పల్మనరీ రెసిసటేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. వైద్యులు సుధాకర్‌రెడ్డి, భవ్యరెడ్డి, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సీపీఆర్‌పై హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ


బీమా నగదు పంపిణీ చేస్తున్న సర్పంచ్

పుల్లలచెరువు: యండ్రపల్లి పంచాయతీ పరిధి నరజాముల ఎస్సీ పాలెంలో ఇటీవల మరణించిన రమేష్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదు శుక్రవారం పంపిణీ చేశారు. రమేష్ భార్య సుధారాణికి బీమా నగదు రూ.10 వేలు సర్పంచ్ యడ్రపల్లి స్వామి, కార్యదర్శి చేతుల మీదగా పంపిణీ చేశారు.

కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు

ముండ్లమూరు: సొంత భూమి లేని రైతులు భూమిని కౌలుకి తీసుకుంటే వారందరికి బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మారం శ్రీనివాసరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి వెంకన్నబాబు, పశువైద్యాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసులు నమోదు

ముండ్లమూరు: మండలంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఇద్దరు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోగా కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. శ్రీనివాసనగర్‌కు చెందిన బీరం శ్రీనివాసరెడ్డి, బూసిరెడ్డి జనార్దన్‌రెడ్డి పొలాలు పక్కపక్కనే ఉంటాయి. బీరం శ్రీనివాసరెడ్డి పొలం దున్ని వ్యవసాయ గొర్రును పొలంలో వదిలి రాగా.. అది మాయవడంతో జనార్దన్ రెడ్డిని అనుమానించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగా జనార్దన్ రెడ్డి అత్త శాలం నరసమ్మ అడ్డుపోగా శ్రీనివాసరెడ్డి కర్రతో నరసమ్మ తలపై కొట్టాడు. దీంతో ఆమె స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అత్త, అల్లుడు కలిసి తనపై దాడి చేశారని శ్రీనివాసరెడ్డి కూడా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉత్సవాలకు తరలిరండి

దర్శి: అమరజీవి గుజ్జుల యలమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని సీపీఐ దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కోరారు. స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో సీపీఐ నాయకులతో శుక్రవారం మాట్లాడారు.

బాలల హక్కులకు ఇబ్బంది కలిగితే చర్యలు


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పద్మావతి

పుల్లలచెరువు: బాలల హక్కులకు ఇబ్బంది కలిగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి హెచ్చరించారు. గురువారం రాత్రి మురికిమళ్ల ఆశ్రమ పాఠశాలలో నిద్ర చేసి శుక్రవారం పాఠశాలను పరిశీలించి అనంతరం పుల్లలచెరువు బీసీ హాస్టల్, జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో మాట్లాడుతూ మురికిమళ్ల పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, నీటి సమస్య, ఫ్యాన్లు, విద్యుత్ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండలస్థాయి అధికారులను ఆదేశించినట్లు పద్మావతి తెలిపారు. కేజీబీవీలో రికార్డులు సక్రమంగా లేకపోవడం, ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించక పోవడం, విధులు సక్రమంగా నిర్వహించక పోవడంపై ప్రిన్స్‌పాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని చదువుకుని ఉన్నత శిఖరాలు చేరాలని, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని పద్మావతి ఆకాంక్షించారు. జిల్లా కమిటీ సభ్యురాలు నీలిమా వంశీలత మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సీడీపీవో పద్మావతి, హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీబాషా పాల్గొన్నారు.

మార్గదర్శి మానిటరింగ్‌గా రాంభూపాల్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో 9,10,11,12 తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మార్గదర్శి మానిటరింగ్ చేసేందుకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు మార్కాపురం రాంభూపాల్‌రెడ్డిని కలెక్టర్ నియమించారు. విద్యార్థులకు వారంలో ఒక రోజు మోటివేషన్ క్లాసులు తీసుకుని కెరియర్ గైడెన్స్‌పై ఆయన అవగాహన కల్పించనున్నారు.

రెండు పాత మిద్దెలు నేలమట్టం

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ పంచాయతీ పరిధి లింగాపురంలో రెండు పాత మిద్దెలు శుక్రవారం కూలి పోయాయి. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కసిరెడ్డి వీరారెడ్డి, పిచ్చన్నలకు చెందిన రెండు పాత మిద్దెలు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిని నేలమట్టమయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

అమరవీరుల త్యాగాలు విస్మరించొద్దు

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు


అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: అమరవీరుల త్యాగాలను విస్మరించరాదని ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి నాదేశం కార్యక్రమం సందర్భంగా మండలంలోని ఎల్.కోటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికి ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. డ్వామా ఏపీడీ భాస్కర్, ప్రధానోపాధ్యాయులు పీవీ రామకృష్ణ, జెడ్పీటీసీ కొత్తపల్లె జ్యోతి, ఎంపీడీఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఎస్సీ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా వాడితే భూసారం దెబ్బతింటుందని, అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం మాదాలవారిపాలెం ఆర్బీకేలో జరిగిన మండల వ్యవసాయ సాయ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడి కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడుతుండటంతో నేల కలుషితమమై, దిగుబడి తగ్గుతోందన్నారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ రైతులకు రూ.10 వేల విలువ చేసే పరికరాలతోపాటు 9 రకాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, దర్శి ఏడీఏ కె.బాలాజీనాయక్, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.సుబ్బారావు, ఏఓ జైనులాబ్దిన్, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జి.శ్రీనివాసులు, సాయి రాజేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన రామయ్య అనే వ్యక్తి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రామయ్య కొందరు రేషన్‌కార్డుదారులు, డీలర్ల వద్ద బియ్యం కొనుగోలు చేసి ఆటోల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. తనకు అధికారుల అండదండలు ఉన్నాయంటూ నిర్భయంగా ఎక్కడపడితే అక్కడ రేషన్ బియ్యాన్ని బహిరంగంగా తరలిస్తున్నాడు. సంబంధిత అధికారులు రేషన్ తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: మండలంలోని మొగుళ్లపల్లిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ

గిద్దలూరు రూరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమం ఆవరణలో ఈ నెల 14వ తేదీ వరకు యోగా నిర్వాహకులు పురుషోత్తమరెడ్డి పర్యవేక్షణలో యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 5.15 గంటల నుంచి 7.45 వరకు యోగాపై శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు యోగాలో పాల్గొనాలని కోరారు.

నాయుడుపల్లి కేసులో నిందితుల అరెస్టు

మార్కాపురం రూరల్: మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో ఈనెల 9వ తేదీన జరిగిన ఘర్షణలో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఏడాది క్రితం గ్రామంలో కోట్ల చిననాగమ్మ, పున్నయ్య, నిశినం శ్రీను కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో నిశినం శ్రీను, చిన్న అలూరయ్య గ్రామానికి దూరంగా ఉంటున్నారు. ఈనెల 9న కోట్ల చిననాగమ్మ, పున్నయ్య, చినబాబు తదితరులు కలిసి నగేష్ ఇంటికి నిప్పు పెట్టారు. నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్ల నివారణ

కొమరోలు: ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్లను నివారించవచ్చని గిద్దలూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ఉపయోగాల గురించి శుక్రవారం రైతులకు వివరించారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుతో ఖర్చులు తక్కువ, దిగుబడి ఎక్కువ ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్ మద్దిలేటి రెడ్డి తన సిబ్బందితో కలిసి దశపర్ణి కషాయాన్ని తయారు చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ పాల్గొన్నారు.

చెంచుగూడేల సర్వేపై శిక్షణ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఐటీడీఏ ప్రాజెక్టు, విద్యాశాఖ ఆధ్వర్యంలో సీవీటీజీ మిషన్ చెంచుగూడేల సర్వేకు సంబంధించి శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతుల్లో ప్రాజెక్టు పరిధిలోని 7 మండలాలకు చెందిన ఎంపీడీఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఏపీఓ జనరల్ సురేష్‌కుమార్, డీఎల్‌డీఓ సాయికుమార్, ఇన్‌చార్జి పీఎం కేజీ నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, తీగల మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తర్లుపాడురోడ్డు, విద్యానగర్, ఎస్సీ బీసీ కాలనీ, పీఎస్ కాలనీ, బాపూజీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, కంభం రోడ్డు, కొండేపల్లి రోడ్డు, ఎన్‌ఎస్ నగర్, వేములకోటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సీయానాయక్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బేస్తవారిపేట: మండలంలో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. మోక్షగుండం, పెంచికలపాడు, పందిళ్లపల్లె, పూసలపాడు, ఒందుట్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోస్టాఫీస్‌లో త్రివర్ణ పతాకాలు

కొమరోలు: స్థానిక పోస్టాఫీసుల్లో త్రివర్ణ పతాకాలు అందుబాటులో ఉన్నాయని పోస్టుమాస్టర్ జాజం వెంకట నారాయణ తెలిపారు. ఆజాదికా అమృత్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై భారత పౌరులందరూ జెండా ఎగురవేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని, ప్రజలు జాతీయ జెండాను కొనుగోలు చేసి ఇంటిపై ఎగురవేయాలన్నారు. ఒక్కో జాతీయ జెండా 25 రూపాయలు మాత్రమేనని, తమ దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

భూములు ఇప్పించాలని ధర్నా

కురిచేడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని ఎన్‌ఎస్‌పీ అగ్రహారానికి చెందిన కేసనపల్లి రాములమ్మ శుక్రవారం ధర్నా చేసింది. వికలాంగురాలైన తనకు తన తండ్రి దాన సెటిల్‌మెంటు కింద ఇచ్చిన సాగుభూమి, ఇల్లును తన తమ్ముడు ప్రభాకర్ ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నాడు. దీనిపై ఎన్నిసార్లు తహసీల్దార్ కు వనతిపత్రం ఇచ్చినా పట్టించుకోకపోవటంతో ధర్నాచేస్తున్నట్లు తెలిపింది.